క్లుప్తంగా

టీషర్టుల పంపిణీ



క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: మండలంలోని పోతులపాడు గ్రామ సర్పంచ్ పల్లె నిర్మలమ్మ మంగళవారం పది మంది క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు.

మౌలిక సౌకర్యాలపై ఆరా



కాలనీ వాసుల సమస్యలు తెలుసుకుంటున్న అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి హుసేనయ్య

సాక్షి ఎఫెక్ట్

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలోని ఎరుకలి కాలనీలో మౌలిక సౌకర్యాలపై అధికారులు ఆరా తీశారు. ‘మా బతుకులు ఇంతేనా’ శీర్షికన మంగళవారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు స్పందించారు. జిల్లా అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ హుసేనయ్య జూపాడుబంగ్లాకు చేరుకొని ఎరుకలి కులస్తులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి తిప్పన్న, సర్పంచ్ మొట్టె బాలయ్య ఉన్నారు.

కుమారస్వామికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేషక్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్య స్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు.

క్రీడలతో మానసికోల్లాసం



రిబ్బన్ కట్ చేసి కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం

జూపాడుబంగ్లా: క్రీడల వల్ల మానసిక, శారీరక దృఢత్వం పెరుగుతుందని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, జూపాడుబంగ్లా ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని భాస్కరాపురం గ్రామంలో నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. అనంతరం 40 మంది క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేశారు.

రహదారిపై ట్యాంకర్‌తో నీళ్లు

పాములపాడు: నేషనల్ హైవే 340సీ నిర్మాణ పనుల కాంట్రాక్టర్ ట్యాంకర్‌తో రోడ్డు వెంట నీళ్లు చల్లిస్తున్నారు. ఇటీవల ‘టిప్పర్ల జోరు.. రైతుల బేజారు’ శీర్షికన ప్రచురితమైన వార్తకు కాంట్రాక్టర్ స్పందించారు. రోడ్డుపై దుమ్ము లేసి రైతులు, ప్రయాణికులు ఇబ్బంది పడకుండా నీళ్లు చల్లించేందుకు చర్యలు తీసుకున్నారు.

రెవెన్యూ సదస్సుకు 8 వినతులు

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు గ్రామంలో మంగళవారం సర్పంచు షేక్ నాజియా ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 8 వినతులు స్వీకరించినట్లు తహసీల్దార్ ఉమారాణి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మేరి పాల్గొన్నారు.

భూ సమస్యలు సత్వరమే పరిష్కరిస్తాం

జూపాడుబంగ్లా: భూ సమస్యలపై సరైన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే సత్వరమే పరిష్కరిస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని తంగడంచ గ్రామంలో సర్పంచ్ ఈడుల ఈశ్వరరెడ్డి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగన్న తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

జూపాడుబంగ్లా: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం మండల కన్వీనర్ కర్ల డిమాండ్ చేశారు. మంగళవారం పారుమంచాల గ్రామ బస్టాండు ఆవరణలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రి అమిత్‌షా దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా రాజ్యసభలో అంబేడ్కర్‌ను కించపరిచేలా మాట్లాడారన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేయండి

- శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు
- అధికారులతో కలిసి నాటలూటి, వెంకటాపురం ప్రాంతాల పరిశీలన



నాగలూటి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న దేవస్థాన ఈఓ

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. శ్రీశైల మహాక్షేత్రంలో ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై పలు ప్రదేశాలను ఈఓ పరిశీలిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం వెంకటాపురం, నాగలూటి ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగలూటి వద్ద జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని సూచించారు. నాగలూటి తదితర ప్రదేశాలలో గత సంవత్సరం కంటే అధికంగా షైప్‌పెండాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. నాగలూటి వద్ద వీరభద్ర స్వామి ఆలయానికి రంగులు వేయాలని, గతేడాది కంటే అధికసంఖ్యలో వాటర్ ట్యాంకర్లను పంపాలని ఆదేశించారు. నాగలూటి ప్రాంతాల్లో అన్నదానం చేస్తున్న భక్తబృందాలకు దేవస్థానం తరఫున పూర్తి సహాయసహకారాలు అందించాలని సూచించారు. జనరేటర్లను ఏర్పాటు చేసి తాత్కాలిక విద్యుద్దీకరణ పనులు చేపట్టాలని, నాగలూటి వద్ద పుష్కరిణిని, భావిని శుభ్రం చేసి భక్తులకు అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయా ప్రదేశాలలో తాత్కాలిక శౌచాలయాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయా పనులన్నీ ఫిబ్రవరి మొదటి వారంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈఓ వెంట ఈఈలు బాలమురళీకృష్ణ, నరసింహారెడ్డి, డీఈఈ చంద్రశేఖరశాస్త్రి, సుబ్బారెడ్డి, ఏఈ రంగప్రసాద్ ఉన్నారు.

నేడు స్వామివారి స్పర్శదర్శనం, ఆర్జిత అభిషేకాలు నిలుపుదల

శ్రీశైల దేవస్థానంలో బుధవారం ఐచ్ఛిక సెలవు కారణంగా భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని, ఈ కారణంగా స్వామివార్ల స్పర్శదర్శనం పూర్తిగా నిలుపుదల చేసినట్లు శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఈఓ మాట్లాడుతూ బుధవారం భక్తుల రద్దీ కారణంగా భక్తులందరికీ మల్లన్న సౌకర్యవంతమైన దర్శనం కలిగించేందుకు స్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే స్వామివారి ఆర్జిత గర్భాలయ అభిషేకాలు, ఆర్జిత సామూహిక అభిషేకాలు కూడా నిలుపుదల చేశామన్నారు. ఉదయాస్తమానసేవ, ప్రాతఃకాలసేవ, ప్రదోషకాల సేవలు కూడా నిలిపేశామన్నానరు. సర్వదర్శనం క్యూలైన్లలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు, భక్తులందరికి త్వరితగతిన స్వామివారి దర్శనం కల్పించేందుకు వీలుగా గతంలో మాదిరిగానే ప్రస్తుతం కూడా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈఓ తెలిపారు. క్యూకాంప్లెక్స్‌లో వేచిఉన్న భక్తులకు సమయానుసారంగా తాగునీరు, అల్పాహారం అందజేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి అన్నప్రసాద భవనంలో అన్నప్రసాద వితరణ ఉంటుందని, దర్శనాలు ప్రారంభమైనప్పటి నుంచి భక్తులకు లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రాల్లో లడ్డూ ప్రసాదాలు అందుబాటులో ఉంటాయని ఈఓ తెలిపారు.

నూతన శుభాకాంక్షలు



మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గ ప్రజలకు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త సంవత్సరంలో ప్రతిఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో తాను అందుబాటులో ఉండనని, ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు.



బైరెడ్డి సిద్ధార్థరెడ్డి | డాక్టర్ దార సుధీర్

నందికొట్కూరు: నియోజకవర్గ ప్రజలకు శాప్ మాజీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2025లో ప్రతి ఒక్కరూ అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని, ప్రతిరోజు సంతోషంగా గడపాలని వారు ఆకాంక్షించారు.

బదిలీలు సర్వసాధారణం



హరినాథ్‌ను సన్మానించిన ఎస్‌ఐ కేశవ, సిబ్బంది

కొత్తపల్లి: ప్రతి ఉద్యోగికి బదిలీలు సర్వసాధారణమని ఎస్‌ఐ ఎం కేశవ అన్నారు. మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్ కానిస్టేబుల్ హరినాథ్ నంద్యాల వన్‌టౌన్‌కు బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆయనను సిబ్బందితో కలిసి ఎస్‌ఐ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సాధారణమని, అయితే ఎక్కడ పనిచేసినా ప్రజల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ బాబా ఫక్రుద్దీన్, హెడ్‌కానిస్టేబుళ్లు రవీంద్ర, శేషారాం సింగ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ



సమస్యలను పరిష్కరించాలని ఎంపీ శబరికి వినతి పత్రం అందజేస్తున్న ప్రజలు

నందికొట్కూరు: పట్టణంలోని పలు కాలనీల్లో ఎంపీ బైరెడ్డి శబరి అధికారులతో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులందరికీ ఒక రోజు ముందే పింఛన్లు అందజేశామన్నారు. కాగా స్థానికులు పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఎంపీకి వినతి పత్రం అందజేశారు.

- **పగిడ్యాల:** మండలంలోని నెహ్రూనగర్‌లో సామాజిక పింఛన్‌ల పంపిణీ కార్యక్రమానికి నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి హాజరయ్యారు. ఐదుగురు ఒంటరి మహిళలకు కొత్తగా మంజూరైన పింఛన్ సొమ్ము ఎంపీ శబరి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమిత్రమ్మ, సర్పంచ్ రాజేశ్వరి, మాజీ సింగిల్‌విండో చైర్మన్ కట్టుబడి శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి వీరన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.
- **జూపాడుబంగ్లా:** మండల వ్యాప్తంగా ఉన్న 4,947 పింఛన్లలో మంగళవారం సాయంత్రానికి 4,712 పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. మిగతా వారికి ఒకటి, రెండు రోజుల్లో అందజేస్తామన్నారు. కాగా ఎవరైనా రెండు మాసాల పింఛన్ తీసుకోకపోయినా మూడో మాసంలో ఒకేసారి ఇస్తామన్నారు.
- **వెలుగోడు:** మండలంలో 96% పింఛన్ల పంపిణీ పూర్తి చేశామని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి తెలిపారు. మండలంలో మొత్తం 6443 పింఛన్లు ఉండగా 6,197 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేసినట్లు చెప్పారు.
- **పాములపాడు:** మండలంలో 95 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. పింఛన్ల పంపిణీని ఆయన పరిశీలించారు.

తప్పులు సవరించుకోండి

కొత్తపల్లి: కుల ధ్రువీకరణలో ఏవైనా తప్పులు ఉంటే సవరించుకోవాలి ఎంపీడీఓ మేరి సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడారు. మండలంలో గతంలో జరిగిన క్యాస్ట్ సర్వేలో కుల ధ్రువీకరణలో కులం పేరులో తప్పులు ఉంటే 11వ తేదీలోపు సవరించుకొనేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు.

93.52 శాతం పింఛన్ల పంపిణీ

సామాజిక పింఛన్ల పంపిణీ మండలంలో మంగళవారం ప్రారంభమైంది. మొత్తం 4,167 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా 3,897 మందికి అందజేశామని ఎంపీడీఓ తెలిపారు. మిగతా 270 మందికి ఒకటి రెండు రోజుల్లో పంపిణీ చేస్తామన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూమి సారవంతం



మినుము పైరును పరిశీలిస్తున్న ఏడీఏ ఆంజనేయ

పాములపాడు: పచ్చిరొట్ట ఎరువులతో భూమి సారవంతమవుతుందని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ తెలిపారు. మంగళవారం మిట్టకందాల, జూటూరు గ్రామాల పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పైరును పరిశీలించి రైతులతో మాట్లాడారు. పొలాల్లో భూసారం పెంచుకోవడానికి జీలుగా, పెసర, మినుము తదితర పచ్చిరొట్ట ఎరువులు సాగు చేయాలన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈకేవైసీపై ఎంపీడీఓ చంద్రశేఖర్, వ్యవసాయ సహకార సంఘం సీఈఓ లక్ష్మణ్‌నాయక్‌లతో కలిసి చర్చించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

- **కొత్తపల్లి:** మండల పరిధిలోని దుద్యాల, కొక్కెరంచ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రైతులకు మినుములో పల్లాకు తెగులు, యాజమాన్య పద్ధతులు, కందుల పంటలో సస్యరక్షణ పద్ధతులపై మండల వ్యవసాయాధికారి కె.మహేష్ రైతులకు వివరించారు. మొక్కజొన్న, కందిపంటలను సందర్శించి రైతులకు తీసుకోవాల్సి జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పట్టుపరిశ్రమ శాఖ అధికారి లింగమూర్తి, పశుసంవర్ధక శాఖ అధికారి సుబ్బలక్ష్మి, గ్రామ సహాయకులు అశోక్, శేషు పాల్గొన్నారు.
- **మిడుతూరు:** సస్యరక్షణలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ పీరునాయక్ అన్నారు. మంగళవారం తలముడిపి, అలగనూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడారు. కంది, మినుము, మిరప, మొక్కజొన్న తదితర పంటలను పరిశీలించి, చీడపీడల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే రైతులు పండించిన కంది దిగుబడులను ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని, దళారులను నమ్మి మోస పోవద్దని ఏఓ సూచించారు.
- **ఆత్మకూరు:** మండలంలోని పిన్నాపురం, శ్రీపతిరావుపేట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి మినుము, మొక్కజొన్న పంటల్లో సస్యరక్షణ చర్యల గురించి రైతులకు తెలియజేశారు. పట్టు పరిశ్రమ అధికారిణి అరుణ, వ్యవసాయ విస్తరణాధికారిణి లతమ్మ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

ఆత్మకూరు: పట్టణంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం పీఆర్‌టీయూ – 2025 డైరీ, క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విధుల పట్ల అంకితభావంతో పని చేయాలన్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ నాగజ్యోతి, తహసీల్దార్ రత్నరాధిక, డీఎస్పీ రామాంజినాయక్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంశెట్టి, ఎంఈఓ బాలాజినాయక్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్‌చాంద్‌బాషా, రాష్ట్ర నాయకులు సయ్యద్ ఇబ్రహీం, నూర్‌మహమ్మద్, రవి, హుసేన్‌సాహెబ్, జిల్లా నాయకులు చంద్రశేఖర్, ప్రసాద్‌రావు, ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు, వెలుగోడు మండలాల కార్యదర్శులు ప్రదీప్‌కుమార్, కరిముల్లా, మదన్‌మోహన్‌రెడ్డి, హరిబాబు, రమణయ్య పాల్గొన్నారు.

ప్రగతి బాటలో ముందడుగు వేద్దాం



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఆత్మకూరు: ప్రగతి బాటలో ముందడుగు వేద్దామని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, మండల కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. మంగళవారం స్థానిక సుదర్శనవర్మ భవన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో మనమంతా భారతీయులం, హిందూ, ముస్లిం, క్రైస్తవులు ఎవరైనా భరతమాత ముద్దుబిడ్డలే, దేశ సమైక్యత మత సామరస్యం వెల్లివిరియాలని, 2025 నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుదామని కర పత్రాలను విడుదల చేశారు. అందరికీ నూతన సంవత్సరం కలిసిరావాలని ఆకాంక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సురేంద్ర, షేక్ ఇస్మాయిల్, వీరన్న, కిరణ్ పాల్గొన్నారు.

పామాయిల్ సాగుతో రైతుల అభివృద్ధి

కొత్తపల్లి: పామాయిల్ సాగుతో రైతుల అభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ మేరి సూచించారు. మంగళవారం మండలంలోని ఎదురుపాడు గ్రామ శివారులో సాగుచేసిన పామాయిల్ పంటను ఏపీఓ హరికృష్ణతో కలిసి పరిశీలించారు. గ్రామంలోని గోకులం షెడ్ల నిర్మాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతులు పామాయిల్ సాగుకు ముందుకు రావాలన్నారు.

విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలి

కొత్తపల్లి: మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి యేసురత్నం, మండల కార్యదర్శి ఎన్.స్వాములు సూచించారు. మంగళవారం సింగరాజు పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

త్వరలో విద్యుత్ సరఫరా చేస్తాం



విద్యుత్‌లైన్ పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

కొత్తపల్లి: మండలంలోని జానాల గూడేనికి త్వరలోనే విద్యుత్ సరఫరా చేస్తామని విద్యుత్ శాఖ ఎస్ఈ సుధాకర్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని సంగమేశ్వరం, సిద్దేశ్వరం, బలపాలతిప్ప, జానాల గూడెంలను సందర్శించారు. ముందుగా నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్‌ను పరిశీలించారు. ఏమైనా సమస్యలున్నాయా అని ఆరా తీశారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ మీటర్లను పరిశీలించారు. ఇంకా విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసుకోని వారు త్వరగా ఏర్పాటు చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు సైతం వెలుగులు నింపేందుకు ప్రభుత్వ కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగానే సంగమేశ్వరం నుంచి జనాల గూడెం వరకు 7 కిలోమీటర్ల మేర రూ.96 లక్షల వ్యయంతో నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయన వెంట విద్యుత్ శాఖ ఈఈ జయశంకర్, డీఈ రామసుబ్రహ్మణ్యం, ఏఈ అబ్దుల్ అబీద్ పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న మల్లు వెంకటరెడ్డి

మిడుతూరు: హిందూ ధర్మ పరిరక్షణకు హిందువులంతా కృషి చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని మాసపేట గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో నాలుగు రోజుల ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తి భావంతో మెలగాలని సూచించారు. రామాయణం, మహాభారతం, భగవద్గీత తదితర వాటిని బాల్యం నుంచి పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. నైతిక విలువలతో కూడిన విద్యతోపాటు భారతీయ సంస్కృతి సంప్రదాయాలను మరుగున పడకుండా కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రతి హిందువూ ప్రతి రోజు ఆలయాలను సందర్శించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి, గ్రామస్తులు, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సీఐ, ఎస్ఐ, పోలీసులు

నందికొట్కూరు: నాటు సారా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని నందికొట్కూరు ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు నాయక్ హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని కోళ్లబావాపురం అటవీ సమీపంలో నాటు సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 1,000 లీటర్ల బెల్లం ఊటను ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు నాయక్, ఎస్ఐ, పోలీసులు ధ్వంసం చేశారు. తయారు చేస్తున్న నాటు సారా స్థావరాలపై జిల్లా ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు ఎక్సైజ్ పోలీసులు విస్తృత దాడులు నిర్వహించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ జఫ్రుల్లా, హెడ్ కానిస్టేబుల్ శంకర్ నాయక్, పోలీసులు సుధీర్‌కుమార్, శివన్న, మధుప్రసాద్ పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం



టవళ్ల సాయంతో లారీ డ్రైవర్ వలిని బయటకు లాగుతున్న దృశ్యం

పగిడ్యాల: ప్రమాదవశాత్తూ కేసీ కాలువలో పడిన లారీ డ్రైవర్‌కు త్రుటిలో ప్రాణాపాయం తప్పిన ఘటన పాత ముచ్చుమర్రిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. నందికొట్కూరుకు చెందిన లారీ డ్రైవర్ వలి జీవనోపాధి రీత్యా ఉదయం వడ్ల బస్తాల లోడును తీసుకెళ్లేందుకు పాత ముచ్చుమర్రికి చేరుకున్నాడు. కేసీ కాలువ గట్టుపై ఆరబోసిన వరి ధాన్యాన్ని సంచుల్లో నింపి కాటా వేసేందుకు హమాలీలు పనిలో నిమగ్నమయ్యారు. లారీ లోడింగ్ ఆలస్యం కావడంతో లారీ డ్రైవర్ కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోవడానికి కాలువలోకి దిగాడు. ఈ క్రమంలో కాలు జారి నీటిలో పడి కొట్టుకుపోతుండగా అటూ వైపు పొలం పనులకు వెళ్తున్న మహిళలు గమనించి కేకలు వేయడంతో పడమర వనములపాడు గ్రామానికి చెందిన బోయ నాయుడు, నాగన్న స్పందించి టవళ్లు జాయింట్ చేసి అందించి కాపాడారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

వెలుగోడు: ఎస్ఎఫ్ఐ(స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక పొట్టి శ్రీరాములు సెంటర్‌లో ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్ నాయక్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ ఆవిర్భావం నుంచి విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడుతోందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వెలుగోడు అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, సైఫుల్లా, నాయకులు వరుణ్, కటేష్, దయ్, మకుమార్, లీప్, కాంత్, సంక్ పాల్గొన్నారు.